క్లుప్తంగా

ఉన్నత శిఖరాలకు ఎదగాలి


విద్యార్థినికి స్కూల్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రతి విద్యార్థినీ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. స్థానిక కస్తూరిబా నగర పాలక ఉన్నత పాఠశాలలో స్కూల్ కిట్స్‌ను శుక్రవారం విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ శ్రద్ధతో విద్యనభ్యసించి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్ అబ్రహాం, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.సోమశేఖర్, ఎంఈఓ రూపావతు రంగయ్య, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 17 నుంచి ఏలూరు వసంతమహల్ సెంటర్‌లోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో టైపు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీలో ఇంటర్ కామర్స్‌తో ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్నట్టు తెలిపారు. 17 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లో 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీరాములు కోరారు.

వివిధ సంఘాల హర్షం

ఏలూరు (టూటౌన్): ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల శుక్రవారం ఐలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు వి.శైలజ, ప్రధాన కార్యదరిశ కామన మునిస్వామి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ నర్సింహ, కె.శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల వృత్తి రక్షణ చట్టాన్ని చేయాలని, సంక్షేమ నిధి కేటాయించాలని కోరారు. ఖరీఫ్ సీజన్ పెట్టుబడులకు రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు సాయం అందించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వ్యవసాయ శాఖ ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ పేటలో దళిత సేన రాష్ట్ర మహిళా కార్యదర్శి బేతాళ జయసుధ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- 6,500 ఎకరాల్లో వరిసాగు
- 250 క్వింటాల విత్తనాల విక్రయం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తోన్న వర్షాల ఆధారంగా నారుమడులు వేసే పనిలో పడ్డారు. మల్కాపురం, వెంకటాపురం, మాదేపల్లి, పోణంగి, జాలిపూడి,చాటపర్రు, కాట్లంపూడి, లింగారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురం, చొదిమెళ్ల ప్రాంతాల్లో రైతులు అధిక శాతం వరి సాగు చేస్తున్నారు. కృష్ణా, గోదావరి కాలువకు ఏలూరు రూరల్ మండల గ్రామాలు శివారున ఉండడంతో ఏటా సాగు పనులు ఆలస్యంగా ప్రారభమౌతున్న సంగతి తెలిసిందే.


వెంకటాపురంలో నారుమడి కోసం దుక్కిదున్నతున్న రైతులు


మల్కాపురం ఆర్‌బీకే నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు

వర్షాలపైనే ఆధారం



ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు కొనుగోలు చేశాం. వర్షాలు మంచిగా కురవాలి. ఖరీఫ్ అంతా వర్షాలపైనే ఆధారం. వర్షాలు పుష్కలంగా కురిస్తే కాలువల్లో నీరు పారుతుంది. ఈ ఏడాది మంచిగా వర్షాలు పడతాయని అధికారులు చెబుతున్నారు. ఎకరానికి కనీసం 30 క్వింటాలు విత్తనాలు అవసరమౌతాయి. కష్టానికి తగ్గ మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

– జి.దుర్గారావు, చాటపర్రు

ఆర్బీకేల్లో విత్తనాల విక్రయం



మండలంలో సుమారు 6 వేలు నుంచి 6,500 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో కేజీకి రూ.5 సబ్సిడీతో 250 క్వింటాల విత్తనాలు విక్రయించాం. వీటి మొత్తం విలువ రూ.8,58,000 ఉంటుందని, సబ్సిడీ రూపంలో రైతులు రూ.1.12 లక్షలు లబ్ధి పొందారని తెలిపారు. ఎంటీయూ 13, 18 రకం విత్తనాలు అధికంగా అమ్ముడవుతున్నాయి.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

వ్యాధులపై అప్రమత్తత అవసరం


చాటపర్రు దళితవాడలో వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు రూరల్ : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. శుక్రవారం చాటపర్రు పీహెచ్‌సీ వైద్యధికారి శ్రీకృష్ణ సూచనల మేరకు చాటపర్రు దళితవాడలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ మలేరియా మాసోత్సవంలో భాగంగా ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనేక సీజనల్ వ్యాధులకు గురౌతారని వివరించారు. ఇంటి పరిసరాల్లోని తొట్టెలు, డ్రమ్ములు, కుండీలు, రుబ్బురోలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో వాడేసిన ఇంజిన్ ఆయిల్ చల్లితే దోమల పెరుగుదల అడ్డుకోవచ్చన్నారు. ఫలితంగా దోమల వల్ల ప్రబలే మలేరియా జ్వరాలను అడ్డుకోవచ్చని తెలిపారు. దోమ నుంచి రక్షణకు దోమ తెరలు ఉపయోగించాలని, సాయంత్ర వేళల్లో దోమలు ఇళ్లలోనికి రాకుండా కిటికీలు వేసుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త సంధ్యారాణి, మేకా శ్రీనివాసరావు, జ్యోతి, సుహాసిని, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ధాన్యం బకాయి సొమ్ము చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రబీ ధాన్యం రైతులు, కౌలుదారులు అమ్మి 40 రోజులు దాటిపోతున్నా సొమ్ములు ఇంకా చెల్లించలేదని తెలిపారు. ఎన్నికల ముందు రెండు మూడు రోజులకే ధాన్యం డబ్బులు చెల్లించి, ఎన్నికల అనంతరం పౌరసరఫరాల శాఖ చేతులెత్తేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు రూ.240 కోట్లు ధాన్యం బకాయి సొమ్ములు రైతులకు, కౌలు రైతులకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఖరీఫ్ సాగు నిమిత్తం విత్తనాల కొనుగోలుకు కూడా చేతిలో పెట్టుబడికి సొమ్ములు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత పంట అప్పులు చెల్లించకపోవడంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి అప్పులు దొరికే పరిస్థితి లేదని, సార్వా సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. కొత్త ప్రభుత్వం ధాన్యం బకాయి సొమ్ములు తక్షణం చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని రవి డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

సామాజిక వైద్యుడు చేగువేరా


చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): సమాజానికి వైద్యం చేయడానికి యత్నించిన సామాజిక వైద్యుడు చేగువేరా అని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన చేగువేరా 96వ జయంతి కార్యక్రమం కంప్యూటర్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎన్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కంప్యూటర్ శిక్షణా కేంద్రం విద్యార్థులు చేగువేరాకు జోహార్లర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ 1928లో అర్జెంటైనాలో జన్మించిన చేగువేరా మెడిసిన్ చదివారన్నారు. దక్షిణ అమెరికాలో ప్రజల పరిస్థితులను అమెరికా పెత్తనాన్ని మోటార్ బైక్ ద్వారా సందర్శించి, అమెరికా వ్యతిరేక పోరాటానికి పూనుకున్నారని గుర్తుచేశారు. అమెరికాకు 90 కిలో మీటర్ల దూరంలో ఉన్న క్యూబాలో ఫెడ్రల్ క్యాస్ట్రోతో కలిసి తిరుగుబాటును చేసి దేశాన్ని విముక్తి చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడన్నారు. ఆర్థిక మంత్రిగా ప్రపంచ దేశాల మద్దతుతో క్యూబా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. భారతదేశంలో ఢిల్లీ, కలకత్తా నగరాలకు వచ్చి మద్దతు కోరాడని తెలిపారు. ప్రపంచంలో పంచదార ఉత్పత్తి, వైద్య రంగం, బాక్సింగ్ రంగంలో క్యూబా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అందుకు చేగువేరా వేసిన పునాది తోడ్పడిందని చెప్పారు. కార్యక్రమంలో సాయి సిద్ధార్థ, లక్ష్మణరావు, హారిక, వాసవి, రేష్మ, విజయ్ కుమార్, రాజ్ కుమార్, విజయ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింలకు పథకాలు అమలు చేస్తాం'


ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న అంజుమన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు నియోజకవర్గంలో అర్హులైన ముస్లిలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ప్రతినిధులు శుక్రవారం చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంటిని దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చంటి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం పెంచుతారని, మసీదుల అభివృద్ధికి రూ.1 లక్ష మంజూరు చేస్తారని తెలిపారు. హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, ఎండీ అస్లాం షరీఫ్, కోశాధికారి ఎండీ మదార్‌ఖాన్, రాజా అహ్మద్, రియాజ్ అలీ ఖాన్, ఎండీ జబీవుల్లా, ఎండీ అక్బర్, జాకీర్ హుస్సేన్, ఎండీ ఇలియాస్ పాషా, ఎండీ ఎక్బాల్, ఎస్‌కే అలీ, ఎండీ ఖలీముద్దీన్, ఎస్‌కే ఖాసిమా తదితరులు పాల్గొన్నారు.

16న సినిమా పాటల పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి ఉత్సవం సందర్భంగా ఈ నెల 16వ తేదీన చిన్నారులకు సినిమా పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధినేత సంగీత దర్శకుడు ఎస్‌పీఎస్ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 6 నుంచి 14 లోపు వయసు ఉన్న బాలలు మాత్రమే అర్హులని, పాల్గొన్న వారిలో ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు, సాయంత్రం బాలు పాట – బాలుడి నోట అనే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీఎస్ దీప్‌చంద్ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాడిన పాటలు ఆలపిస్తారన్నారు. అనంతరం బాలు పాడిన పలు గీతాల ఆధారంగా రూపొందించిన బాలుగారి గానామృతం అనే ఆడియో ఆవిష్కరణ ఉంటుందన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


పాతూరులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

భీమడోలు: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని హెచ్ఎం పి.నిర్మలకుమారి తెలిపారు. శుక్రవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు మండే సుధాకర్, సిబ్బంది ఐదేళ్లు నిండిన బాలబాలికల ఇంటింటికీ వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించుకున్నారు. ఒకటవ తరగతిలో ఐదుగురు చిన్నారులు చేరారు. ఈ సందర్భంగా విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వంలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు కనీస వసతులు సమకూరాయన్నారు. పాఠశాలలో డిజిటల్ విద్యతో ఎండీఎం, చిక్కీలను అందించి ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటిన ఎంఈఓ అన్నమ్మ, హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు


కైకరంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మానవ మనుగడకు, సంపూర్ణ ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకునేందుకు మొక్కలు నాటాలని దెందులూరు ఎంఈఓ కే.అన్నమ్మ అన్నారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్ఎల్ఎస్‌వీజీ శర్మ ఆధ్వర్యంలో 48 రకాల మొక్కలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నాటారు. త్వరలోనే నాటిన అన్ని మొక్కలకు గార్డులు ఏర్పాటు చేస్తామని హెచ్‌ఎం శర్మ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తరుణకుమారి, రాధాకృష్ణ, మజీద్‌ఖాన్ ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఉంగుటూరు: చక్కని జీవన విధానం అలవరుచుకోవడం ద్వారా మంచి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చునని కైకరం హైస్కూల్ హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవరుచుకోవడం అనే అంశాలపై ఎకోక్లబ్స్ ఫర్‌మిషన్‌లైఫ్ సంస్థ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బగాది సీతారాములు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గోపన్నపాలెం సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గోపి తెలిపారు. ఉదయం సాయిబాబా ఆలయంలో పూజలు అనంతరం భక్తుల సహకారంతో ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తామని భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన భార్య పిల్లలు రెండు రోజులుగా కనిపించడం లేదని ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన పూల నాగమనోహర్ భార్య, ఇద్దరు పిల్లలు ఈనెల 12న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం తగదు


గణపవరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

గణపవరం: వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా పారిశుధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించరాదని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గణపవరం పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి వారికి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి రోజూ పారిశుధ్య నిర్వహణపనులు జరగాలని, డ్రెయిన్లలో పూడిక ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి.శివ రామ్‌ప్రసాద్‌లకు సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మూర అలంకారం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	40
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు – బీహెచ్ఈఎల్	21,.15	4822	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	54	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	44	కంద	60
పచ్చిమిర్చి	52	బీట్‌రూట్	44
కాకర కాయలు	44–56	కీరా దోస	50
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	188
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	30–55
క్యారెట్	44–54	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	68	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
అనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15–20	చిలకడదుంప	50

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిని ఆశ్విని

భీమడోలు: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశ్విని మాట్లాడుతూ రక్తదానం చేసే వ్యక్తులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో రక్తం చేయాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. రక్తదానం చేసే దాతలు గ్రహీతల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రష్మీ, ఆనంద్, కిషోర్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది అప్పారావు, పరమేశ్వరరావు రోగులు పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్యం కలగదని, రక్తదానం చేస్తే ఆరోగ్యపరిస్థితి మరింత మెరుగవుతుందని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌కుమార్‌రెడ్డి, కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడులో రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలని, 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారం 150 సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.